సాక్షి
ఆదిలాబాద్
మంగళవారం । 12 । సెప్టెంబర్ । 2023

ఎవరెస్ట్ వైపు తొలి అడుగు..



ఆశయ సాధనకు పేదరికం అడ్డు కాదని నిరుపిస్తు న్నాడు.. కుమురం భీం జిల్లా కెరమెరి మండలం కెలి కె గ్రామానికి చెందిన గిత్తే కార్తీక్. సాహసకృత్యాల్లో రాణిస్తూ, కళ ల్లోనూ తన ప్రతిభను చూపుతున్నాడు. 8లో▸



శిబిరంలో నిద్రించి నిరసన

కైలాస్‌నగర్: ఉద్యోగ భద్రత కల్పించాలనే డిమాండ్‌తో సమగ్ర శిక్ష ఒప్పంద ఉద్యోగులు సోమవారం రాత్రి శిబిరంలోనే నిద్రించి తమ నిరసన వ్యక్తం చేశారు.

గరిష్టం/కనిష్టం
30.0/25.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమశాతం పెరగనుంది.

న్యూస్‌రీల్

ప్రజావాణికి స్పందన అంతంతే..



అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ కుష్బూ గుప్తా

కైలాస్‌నగర్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించే ప్రజావాణి ఈ సోమవారం వెలవెలబోయింది. కలెక్టర్ రాహుల్‌రాజ్ అందుబాటులో లేకపోవడంతో అర్జీదారులు అంతగా హాజరు కాలేదు. జిల్లాస్థాయి అధికారులు మాత్రం హాజరయ్యారు. అర్జీదారుల కోసం అధికారులు నిరీక్షించాల్సి వచ్చింది. అదనపు కలెక్టర్లు కుష్బూ గుప్తా, శ్యామలాదేవి బాధితుల నుంచి అర్జీలు స్వీకరించారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తులను సంబంధిత అధికారులకు అందజేస్తూ త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఇందులో జెడ్పీసీఈవో గణపతి, ఆర్డీవో స్రవంతి, మున్సిపల్ కమిషనర్ శైలజ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమైక్యత దినోత్సవానికి అతిథులు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: సెప్టెంబర్ 17న 'తెలంగాణ జాతీయ సమైక్యత దినోత్సవం'కు జిల్లా కేంద్రాల్లో జాతీయ పతాకం ఆవిష్కరించి, గౌరవ వందనం స్వీకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున అతిథులను ఖరారు చేసింది. నిర్మల్‌కు మంత్రి ఏ.ఇంద్రకరణ్‌రెడ్డి, ఆదిలాబాద్ జిల్లాకు ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, కుమురంభీం జిల్లాకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ, సుంకరి రాజు, మంచిర్యాలకు ప్రభుత్వ విప్ బాల్క సుమన్‌ను కేటాయించింది. ఆ రోజు ఉదయం 9గంటలకు జిల్లా కేంద్రాల్లో జాతీయ పతాకాన్ని ఎగరవేయనున్నారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్లు ఏర్పాట్లు చేయాలని సీఎస్ శాంతికుమారి ఆదేశాలు ఇచ్చారు.

మంత్రి ఉదయనిధిని బర్తరఫ్ చేయాలి

ఆదిలాబాద్: సనాతన ధర్మాన్ని కించపరుస్తూ వ్యాఖ్యలు చేసిన తమిళనాడు మంత్రి ఉదయనిధి స్టాలిన్‌ను వెంటనే బర్తరఫ్ చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు పార్టీ ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన చేపట్టారు. స్థానిక వినాయక్ చౌక్‌లో మంత్రి దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ, సనాతన ధర్మంపై విషం చిమ్మేలా ఉన్న మంత్రి వ్యాఖ్యలను ప్రతీ హిందువు ఖండించాలన్నారు. ఉదయనిధిని అరెస్టు చేసి జైలుకు పంపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సుహాసినిరెడ్డి, నాయకులు జోగు రవి, దినేష్ మటోలియా, మయూర్ చంద్ర, లాలా మున్నా, ప్రవీణ్ ఉన్నారు.

మహిళా సదస్సుకు జిల్లా నుంచి ఏడుగురు సర్పంచులు

బోథ్: జాతీయ మహిళా కమిషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఈ నెల 12 నుంచి 14వరకు నిర్వహించనున్న సదస్సుకు జిల్లా నుంచి ఏడుగురు మహిళా సర్పంచులు ఎంపికయ్యారు. ఇందులో ఇచ్చోడ మండలంలోని ముఖరా(కె) సర్పంచ్ మీనాక్షి, బోథ్ మండలంలోని పట్నాపూర్ సర్పంచ్ పంద్రం సుగుణ, మంద బొగడ సర్పంచ్ చాంగు బాయి, తలమడుగు మండలం పల్సి (కె)సర్పంచ్ నైతం పాయల్, జైనథ్ మండలంలోని మాకోద సర్పంచ్ సురేఖ, ఖాప్రి సర్పంచ్ రమీల, గుడిహత్నూర్ సర్పంచ్ జాదవ్ సునీత ఉన్నట్లు జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ తెలిపారు. సదస్సులో 'మహిళల్లో రాజకీయ చైతన్యం' తదితర అంశాలపై అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు.

మాంగనీస్ ఉత్పత్తి డౌన్



ఆదిలాబాద్‌రూరల్ మండలంలోని జందాపూర్‌లో ఓ లీజు సంస్థలో మాంగనీస్ ధాతువు (ఫైల్)

మాంగనీస్ ఉత్పత్తి వివరాలు..

సంవత్సరం	ఉత్పత్తి
2022-23	10,800 టన్నులు
2023-24 (ఇప్పటివరకు)	1800 టన్నులు

భూగర్భ గనుల శాఖకు మాంగనీస్ పరంగా ఆదాయం..

సంవత్సరం	ఆదాయం
2021-22	రూ.63లక్షలు
2022-23	రూ.46 లక్షలు
2023-24 (ఇప్పటివరకు)	రూ.2.18 లక్షలు

- ధాతువు వెలికితీతకు పెరుగుతున్న వ్యయం
- పరిశ్రమల నుంచి దక్కని రేటు
- వెనుకంజ వేస్తున్న లీజుదారులు
- సర్కారుకు తగ్గుతున్న ఆదాయం

సాక్షి,ఆదిలాబాద్: భూగర్భగనుల పరంగా జిల్లాలో ప్రధాన ఖనిజమైన మాంగనీస్ ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోయింది. తద్వారా ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం ఏటా తగ్గిపోతూ వస్తుంది. అలాగని ఖనిజం తగ్గిపోయిందనుకుంటే పొరపాటే. ప్రధానంగా దీన్ని వెలికితీసే లీజుదారులు ఆ ముడిసరుకును పరిశ్రమలకు విక్రయిస్తారు. అయితే వెలికితీతకయ్యే ఖర్చు మేర పరిశ్రమల యాజమాన్యాలు లీజుదారులకు ఇవ్వకపోవడంతో ఇలాంటి పరిస్థితి ఉందని సంబంధిత శాఖ అధికారులు అభిప్రాయపడుతున్నారు. అయితే కర్ణాటకలోని ఓ పరిశ్రమతో స్థానిక లీజుదారులు పెట్టుబడికయ్యే ఖర్చు మేర టన్నుకు ఇచ్చే ధర విషయంలో సంప్రదింపులు చేస్తున్నారు. సయోధ్య కుదిరితే.. జిల్లాలో మళ్లీ మాంగనీస్ వెలికితీత జోరందుకునే పరిస్థితులు ఉన్నాయి.

జిల్లాలోని వనరులివి..

జిల్లాలో ప్రధాన ఖనిజం సున్నపురాయి (లైమ్ స్టోన్), మాంగనీస్ కాగా చిన్న ఖనిజం కంకర, ఇసుక, గ్రావెల్, ఇటుకల పరంగా భూగర్భ గనుల శాఖకు ఆదాయం లభిస్తుంది. మాంగనీస్‌కు సంబంధించి జిల్లాలో ఆదిలాబాద్, జైనథ్, తాంసి మండలాల్లోని జందాపూర్, ఘోట్కురి, గూడ, డబ్బకుచ్చి నిపాని, పిప్పల్‌కోటి, గొల్లఘాట్, కాన్పమేడిగూడ, కుంబఝురి, పిప్పల్‌గావ్, చాందా(టి), భోరజ్ గ్రామాల్లో వేల ఎకరాల్లో నిక్షిప్తాలు ఉన్నాయి.

నాణ్యత తగ్గిందా..

జిల్లాలో లభించే మాంగనీస్ ధాతువు నాణ్యమైన గ్రేడ్ అని గతంలో పేరుండేది. 50 ఏళ్ల క్రితం వరకు 50 గ్రేడ్ వరకు ఉండేదని అధికారులు చెబుతున్నారు. అది క్రమం క్రమంగా తగ్గుతూ వస్తుంది. కొంత కాలం క్రితం వరకు 30 నుంచి 40 గ్రేడ్ వరకు ఉండగా, ప్రస్తుతం 20 నుంచి 30 గ్రేడ్ వరకే ఉంటుందని చెబుతున్నారు.

జిల్లాలో 15 చోట్ల లీజులు..

జిల్లాలో 15 చోట్ల మాంగనీస్ వెలికితీతకు వివిధ సంస్థలకు ప్రభుత్వం లీజుకు ఇచ్చింది. ఇందులో ప్రస్తుతం రెండు చోట్ల మాత్రమే పనులు జరుగుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. మిగతా అన్ని నాన్ వర్కింగ్‌గా ఉన్నాయి. ఇదిలా ఉంటే కొన్ని కంపెనీలు తమ లీజును ప్రభుత్వానికి సరెండర్ చేయడం గమనార్హం.

పరిశ్రమల నుంచి ప్రతికూలత పరిస్థితులు..

జిల్లాలో వెలికితీసిన మాంగనీస్ ధాతువును లీజుదారులు హైదరాబాద్ ప్రాంతంలోని చేగుంట, కేరళ రాష్ట్రంలోని త్రివేండ్రం, ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపూర్‌లో పరిశ్రమలకు విక్రయిస్తూ వస్తున్నారు. అయితే ఈ మాంగనీస్ ధాతువును వెలికితీసే పెట్టుబడి ఖర్చుకు తగినట్లుగా పరిశ్రమలు టన్నుకు ధర ఇవ్వకపోవడంతో లీజుదారులు వెలికితీతకు వెనుకంజ వేస్తున్నారు. దీంతోనే ప్రస్తుతం అనేక లీజు స్థలాల్లో ఈ ఖనిజం ఉత్పత్తి నిలిచిపోయింది. ప్రస్తుతం కర్ణాటకలోని ఓ పరిశ్రమతో మంచి ధర విషయంలో చర్చలు నడుస్తున్నాయి. ఒకవేళ అది కొలిక్కి వస్తే మళ్లీ ఉత్పత్తి మళ్లీ పెరిగే అవకాశాలున్నాయని అధికారులు చెబుతున్నారు.

దశాబ్దాలుగా వెలికితీత..

జిల్లాలో దశాబ్దాలుగా మాంగనీస్ ధాతువును వెలికితీసేందుకు అనేక సంస్థలు పనిచేస్తున్నాయి. అవి ఈ ముడి ఖనిజాన్ని వెలికితీసి పరిశ్రమలకు విక్రయిస్తాయి. టన్నుకు రూ.6వేల నుంచి రూ.7వేల వరకు లభిస్తుంది. అయితే ఆయా పరిశ్రమలు ప్రస్తుతం టన్నుకు రూ.4వేల వరకే చెల్లిస్తుండడంతో ఆయా లీజు కంపెనీలు వెలికితీత భారంగా మారిందని నిలిపివేశాయి. ఈ క్రమంలోనే ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం కూడా తగ్గింది. ఈ ఏడాది ఇప్పటివరకు 3,200 టన్నులు ఉత్పత్తి జరగాల్సి ఉండగా, కేవలం 1800 టన్నులు మాత్రమే వెలికితీయడం గమనార్హం. ఖనిజం ఉన్న చోటును ఆయా సంస్థలు లీజుకు తీసుకుంటాయి. ఆ స్థలానికి సంబంధించి ప్రభుత్వానికి వార్షిక అద్దె రూపంలో చెల్లిస్తాయి. టన్నుకు 5 శాతం వరకు రాయల్టీ రూపేణ లీజు సంస్థ ప్రభుత్వానికి చెల్లిస్తుంది. ఉత్పత్తి మేరకు గనుల శాఖకు ఆదాయం లభిస్తుంది.

ఆదాయం పెంచేలా ప్రయత్నం..



మాంగనీస్ అమ్మకం విషయంలో కర్ణాటకలోని పరిశ్రమతో చర్చలు నడుస్తున్నాయి. అది కొలిక్కి వచ్చిన పక్షంలో మళ్లీ లీజుకు ఇచ్చిన స్థలాల్లో ఉత్పత్తి చేయడం జరుగుతుంది. తద్వారా ప్రభుత్వానికి ఆదాయం పెంచేలా కృషి చేస్తాం.

– రవిశంకర్, ఏడీ, గనులు, భూగర్భశాఖ, ఆదిలాబాద్

ఓటరు దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలి

- కలెక్టర్ రాహుల్‌రాజ్



మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

కైలాస్‌నగర్: నూతన ఓటరు నమోదు, జాబితాలో సవరణ కోసం అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ జిల్లా కలెక్టర్లతో సోమవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటరు జాబితా సవరణ వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, థర్డ్‌జెండర్, ఆదివాసీ పెద్దలతో తరచూ సమావేశాలు నిర్వహించాలన్నారు. ఓటరు నమోదుతో పాటు జాబితాలో సవరణలపై తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులతో కళాజాత నిర్వహించి పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి చాహత్ బాజ్‌పాయ్, అదనపు కలెక్టర్లు కుష్బూ గుప్తా, శ్యామలాదేవి, శిక్షణ సహాయ కలెక్టర్ వికాస్ మహతో పాల్గొన్నారు.

- జిల్లాలో విజృంభిస్తున్న విషజ్వరాలు
- రెండు నెలల్లో తొమ్మిది మంది చిన్నారులు మృతి
- రిమ్స్‌తో పాటు ప్రైవేట్ ఆస్పత్రులు రోగులతో కిటకిట

ఫీవర్రీ



రిమ్స్ ఫీవర్ వార్డులో చికిత్స పొందుతున్న రోగులు

ఆగస్టు 30న రిమ్స్ చిల్డ్రన్స్ వార్డులో ఓ చిన్నారి జ్వరంతో మృత్యువాత పడ్డాడు. జిల్లాకేంద్రంలోని రిక్షా కాలనీకి చెందిన అహాన్(2 నెలలు) తీవ్ర జ్వరం, దగ్గు, ఊపి రాడకపోవడంతో కుటుంబీకులు రిమ్స్‌లో చేర్పించారు. వైద్యులు తీవ్రంగా శ్రమించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. పసికందు మరణించాడు. ఇలా ఆగస్టు నెలలో ఏకంగా ఎనిమిది మంది చిన్నారులు జ్వరాలతో మృతిచెందగా, ఈనెల 1న మూడేళ్ల బాలుడు చనిపోవడం గమనార్హం. అధికారికంగా రెండు నెలల్లో తొమ్మిది మంది చనిపోగా, ప్రైవేట్ ఆస్పత్రుల్లో మరికొంత మంది మరణించినట్లు తెలుస్తోంది.

ఆదిలాబాద్‌టౌన్: చిన్నారులు విషజ్వరాల బారిన పడి కానరాని లోకాలకు వెళ్తుండగా వారి కుటుంబాల్లో తీరని విషాదం నెలకొంటుంది. జిల్లాను ప్రస్తుతం వైరల్ జ్వరాలు వణికిస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. దీంతో దోమలు వృద్ధి చెంది ప్రజలు వ్యాధుల బారినపడేలా చేస్తున్నాయి. వయస్సుతో సంబంధం లేకుండా దగ్గు, జ్వరం, జలుబు, శ్వాస తీసుకోవడానికి జనం ఇబ్బందులు పడుతున్నారు. ఇంట్లో ఒక్కరికి జ్వరం వస్తే ఇంటిల్లిపాది చుట్టుముడుతుంది. రిమ్స్‌తో పాటు ప్రైవేట్ ఆస్పత్రులు రోగులతో కిక్కిరిసిపోతున్నాయి. రిమ్స్‌లో బెడ్లు సరిపోకపోవడంతో ఒక్కో బెడ్‌లో ఇద్దరేసి చొప్పున చికిత్స అందించాల్సిన దుస్థితి.

గాలిలో కలిసిపోతున్న ప్రాణాలు..

విష జ్వరాలతో చిన్నారుల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. రిమ్స్‌లోని చిల్డ్రన్స్ వార్డులో గత నెలలో ఏకంగా ఎనిమిది మంది మృత్యువాత పడగా, ఈనెలలో ఒకరు మరణించినట్లు అధికారులు చెబుతున్నారు. వీరందరికి జ్వరం, దగ్గుతో పాటు ఊపిరాడక తీవ్ర అవస్థలు పడి తుదిశ్వాస విడుస్తున్నారు. శ్వాసకోశ సంబంధిత వైరస్ (ఆర్ఎస్‌వీ) కారణంగానే మరణాలు సంభవిస్తున్నాయని వైద్యులు చెబుతున్నారు. రిమ్స్‌లోని చిల్డ్రన్స్ వార్డులో 70 పడకలు ఉండగా, సోమవారం 130 మంది జ్వరాల బారినపడి చికిత్స పొందుతున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఒక్కో బెడ్‌లో ఇద్దరేసి చొప్పున ఉండటం, ఒకరినుంచి మరొకరికి వైరస్ సోకడంతో మరణాల సంఖ్య పెరుగుతున్నట్లు తెలుస్తోంది. ఆ వార్డుకు వెళితే చిన్నారుల రోధనలు కలచివేస్తున్నాయి.

విషజ్వరాలతో విలవిల..

దోమకాటు జిల్లా వాసులను అతలాకుతలం చేస్తుంది. పల్లె, పట్టణం అనే తేడా లేకుండా జ్వరాల బారిన పడుతున్నారు. రిమ్స్‌లో 500 పడకలు ఉండగా, ప్రస్తుతం అందరు రోగులతో కలిసి 750కి పైగా చికిత్స పొందుతున్నారు. వీరిలో 300 వరకు జ్వరాల బారినపడిన వారు ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. అయితే ఔట్ పేషెంట్ ఇదివరకు 500 నుంచి 600 ఉండగా, వారం పది రోజుల నుంచి 1300 నుంచి 1500 వరకు వస్తున్నట్లు చెబుతున్నారు. సోమవారం రిమ్స్‌లో ఇన్‌పేషెంట్ 718 మంది ఉండగా, ఔట్ పేషెంట్ 1341 మంది చికిత్స చేయించుకున్నట్లు రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ తెలిపారు.

సంవత్సరం	డెంగీ	మలేరియా
2021	231	02
2022	207	02
2023 (ఇప్పటివరకు)	38	02

డెంగీ బెల్స్..

ఏటా ఆగస్టు నుంచి అక్టోబర్ వరకు జిల్లాలో డెంగీతో జనాలు విలవిల్లాడుతున్న విషయం తెలిసిందే. ఈఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు జిల్లాలో 38 మంది డెంగీ బారిన పడగా, అధికారుల లెక్కల ప్రకారం.. ఈనెలలో ఆరుగురు, ఆగస్టులో ఏడుగురు, జూలైలో ఇద్దరు, జూన్‌లో ఐదుగురు చొప్పున ఉన్నారు. అనధికారికంగా ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతూ డెంగీ బారినపడిన వారు అనేక మంది ఉన్నట్లు సమాచారం. చాలా మంది మహారాష్ట్రలోని యవత్మాల్, హైదరాబాద్, నిజామాబాద్ తదితర ప్రాంతాల్లో చికిత్స పొందుతున్నారు. ఇదిలా ఉండగా గ్రామీణ ప్రాంతాలతో పోల్చితే పట్టణ ప్రాంతాల్లోనే డెంగీ కేసులు అధికంగా నమోదవుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని జీడీసీ కాలనీ, సుందరయ్యనగర్, రాంనగర్, ఇచ్చోడలోని సాయినగర్, విద్యానగర్, గుడిహత్నూర్ మండలంలోని డొంగర్‌గావ్, సైద్‌పూర్‌లలో డెంగీ కేసులు ఎక్కువగా నమోదవుతున్నట్లు అధికారులు గుర్తించారు.

నివారణ చర్యలు చేపడుతున్నాం

వ్యాధుల నివారణకు చర్యలు చేపడుతున్నాం. కురుస్తున్న వర్షాలతో వాతావరణంలో మార్పు చోటు చేసుకుంటుంది. దీంతో జ్వరాలు ప్రబలుతున్నాయి. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఈనెలలో ఆరు డెంగీ కేసులు నమోదయ్యాయి. సంబంధిత కాలనీల్లో 50 ఇళ్ల చుట్టూ పైరిత్రంతో స్ప్రే చేయిస్తున్నాం. అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నాం. వారానికి రెండు సార్లు డ్రైడే పాటించాలి. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత , పరిసరాల పరిశుభ్రత పాటించాలి.

– మెట్‌పెల్లివార్ శ్రీధర్, జిల్లా మలేరియా నివారణ అధికారి

రోగుల తాకిడి పెరిగింది

పక్షం రోజులుగా రిమ్స్‌లో రోగుల తాకిడి పెరిగింది. సోమవారం 1,341 మంది ఔట్ పేషెంట్ నమోదవగా, ఆస్పత్రిలోని అన్ని వార్డుల్లో కలిపి 718 మంది ఇన్‌పేషెంట్లు ఉన్నారు. ఆస్పత్రిలో 500 బెడ్లు ఉండగా, అదనంగా బెడ్లు వేసి చికిత్స అందిస్తున్నాం. రోగులకు మెరుగైన వైద్యసేవలందించేందుకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం.

– జైసింగ్ రాథోడ్, రిమ్స్ డైరెక్టర్, ఆదిలాబాద్

నిరసనల జోరు

- ఆందోళనలతో దద్దరిల్లిన కలెక్టరేట్
- సమ్మెలో సమగ్రశిక్ష, ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు
- అదే బాటలో అంగన్‌వాడీలు



ధర్నాలో పాల్గొన్న ఒప్పంద ఉద్యోగులు

కైలాస్‌నగర్: ఉద్యోగ భద్రత కల్పించాలనే డిమాండ్‌తో సమగ్ర శిక్ష, నేషనల్ హెల్త్ మిషన్ ఒప్పంద ఉద్యోగులు, అంగవాడీలు ఇప్పటికే సమ్మె బాట పట్టారు. ఇందులో భాగంగా సోమవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళనలు చేపట్టారు. సర్కారు తీరుపై నిరసన వ్యక్తం చేశారు.

- 'సమగ్ర' సిబ్బంది వినూత్న నిరసన



ఒంటికాలిపై నిల్చొని నిరసన వ్యక్తం చేస్తూ..

సమగ్ర శిక్ష ఒప్పంద ఉద్యోగులు చేపట్టిన సమ్మె 14వ రోజుకు చేరింది. అయినా ప్రభుత్వం స్పందించకపోవడంపై వారు సోమవారం ఒంటికాలిపై నిల్చొని వినూత్న నిరసన తెలిపారు. తమ డిమాండ్లు నెరవేరే దాకా ఉద్యమం ఆగదని ఆ సంఘం నేతలు స్పష్టం చేశారు. వీరి ఆందోళనకు సెక్టోరియల్ అధికారి సుజాత్ ఖాన్, సీపీఎం నాయకులు బండి దత్తాత్రి మద్దతు ప్రకటించారు.

- 8వ రోజుకు 'ఎన్‌హెచ్‌ఎం' సమ్మె

ఎన్‌హెచ్‌ఎం ఒప్పంద ఉద్యోగులు చేపట్టిన సమ్మె 8వ రోజుకు చేరింది. ఇందులో భాగంగా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ప్రభుత్వం త్వరగా స్పందించి తమ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అప్పటి వరకు తమ ఆందోళనలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు.



నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీలు

- సమ్మెకు దిగిన అంగన్‌వాడీలు

అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు విధులు బహిష్కరించి నిరవధిక సమ్మెకు దిగారు. కలెక్టరేట్ ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందజేస్తున్న తమను ప్రభుత్వం పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేసేంత వరకు సమ్మె కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఆందోళనకు సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లేశ్, ఏఐటీయూసీ నాయకుడు రాజు మద్దతు తెలిపారు.

- మిషన్ భగీరథ కాంట్రాక్టర్ల ధర్నా



ధర్నా చేస్తున్న కాంట్రాక్టర్లు

కైలాస్‌నగర్: పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మిషన్ భగీరథ కాంట్రాక్టర్లు సోమవారం ఆందోళన చేపట్టారు. జెడ్పీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, డివిజన్ పరిధిలో మిషన్ భగీరథ పథకానికి సంబంధించిన పైపులైన్లు, ట్యాంకుల నిర్మాణ పనులను 2017 నుంచి చేపట్టామన్నారు. వీటికి సంబంధించి రూ.30కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. పనులు పూర్తయి మూడేళ్లు గడిచినా ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. అధికారులు స్పందించి బిల్లులు త్వరగా విడుదల చేసేలా చూడాలని కోరారు. ఇందులో కాంట్రాక్టర్లు రాజ్ కుమార్, ప్రఫుల్, సాయికిరణ్, వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

నవరాత్రోత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి

- మండపాల ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి
- ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా వ్యాప్తంగా గణేశ్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా, సామరస్యంగా జరుపుకోవాలని ఎస్పీ డి.ఉదయ్‌కుమార్ రెడ్డి అన్నారు. గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా జిల్లా కేంద్రంలోని పోలీసు హెడ్ క్వార్టర్స్ సమావేశ మందిరంలో హిందూ ఉత్సవ కమిటీ, సనాతన హిందూ ఉత్సవ కమిటీ, ఇతర హిందూ బంధువులు, గణేశ్‌మండపాల నిర్వాహకులు, ప్రజాప్రతినిధులతో సోమవారం శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, పండుగలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అందరి సహకారం అవసరమన్నారు. పట్టణాన్ని పది సెక్టార్లుగా విభజించి, సెక్టారుకో ఎస్సైని పర్యవేక్షణ అధికారిగా నియమించినట్లు తెలిపారు. గణేశ్ నిర్వహణ కమిటీ సభ్యులు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా మండపాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రతీ మండపం నిర్వాహకులు ఆన్‌లైన్‌లో కమిటీ సభ్యులు, నిమజ్జనం తేదీ, ప్రదేశం, సహాయకులు తదితర వివరాలను తప్పకుండా పొందుపర్చాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ డీజేలను వాడకూడదని, వాటికి అనుమతి లేదని స్పష్టం చేశారు. ఉత్సవాల నేపథ్యంలో పోలీస్‌శాఖ గట్టి బందోబస్తు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. సమావేశంలో హిందూ ఉత్సవ సమితి సభ్యులు, ఆదిలాబాద్ పట్టణ ప్రజాప్రతినిధులు, డీఎస్పీ ఉమేందర్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అదుపుతప్పి కారు బోల్తా



బోల్తా పడిన కారు

ఉట్నూర్‌రూరల్: మండలంలోని లక్కారం సమీపంలో కారు అదుపుతప్పి బోల్తా పడింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం రాత్రి దంతన్‌పల్లికి చెందిన కారు మత్తడిగూడ నుంచి ఉట్నూర్ వైపు వెళ్తుండగా అదుపుతప్పి విద్యుత్‌స్తంభాన్ని ఢీకొట్టి పంట పొలాల్లోకి దూసుకెళ్లింది. ఘటనలో ఎవరికీ గాయాలు కాకుండా బయటపడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. దీనిపై ఎస్సై మనోహర్‌కు వివరణగా కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతామన్నారు.

ఉచిత శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి

ఉట్నూర్‌రూరల్(ఖానాపూర్): ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజన నిరుద్యోగ యువతీ యువకులకు ఆయా విభాగాల్లో ఇవ్వనున్న ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్, ఏర్పోర్టు క్యాంపస్ ఆధ్వర్యంలో యువకులకు వెల్డింగ్, డ్రై వాల్/ఫాల్ సీలింగ్, హోటల్ మేనేజ్‌మెంట్, ఎలక్ట్రీషియన్, రిఫ్రిజిరేటర్ / ఎయిర్ కండీషన్, బైక్ మెకానిక్ కోర్సుల్లో, యువతులకు నాగారం, సిరిసిల్ల క్యాంపస్‌లో హోమ్ హెల్త్ ఎయిడ్ కోర్సుల్లో మూడునెలల పాటు ఉచిత శిక్షణతో పాటు వసతి, భోజన సౌకర్యం కల్పించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఈ నెల 13న ఉదయం 10 గంటలకు ఉట్నూర్ కేబీకాంప్లేక్స్ ప్రాంగణంలో ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. 18 నుంచి 30 సంవత్సరాల లోపు ఉండి ఎస్ఎస్‌సీ పాస్ లేదా ఫెయిల్, ఐటీఐ లేదా డిప్లొమా ఎలక్ట్రికల్ విద్యార్హత ఉన్నవారు అర్హులన్నారు.

పీచరలో చిరుత పులి సంచారం..!



పాదముద్రలు పరిశీలిస్తున్న ఎఫ్‌బీవో

లక్ష్మణచాంద: మండలంలోని పీచర గ్రామ శివారులో సోమవారం ఉదయం చిరుతపులి సంచరించినట్లు పుకార్లు రావడంతో గ్రామస్తులు భయాందోళన చెందారు. సర్పంచ్ బుర్రి లత అటవీశాఖ అధికారులకు సమాచారం అందించడంతో ఎఫ్‌బీవో రమేశ్, ఆనిమల్ ట్రాకర్ సంజీవ్ పులి పాదముద్రలు సేకరించారు. వాటిని పరిశీలించి ఇవి చిరుత పులివి కావని, హైనావని నిర్ధారించడంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.

చిరుత పులి కాదు.. నక్కే

సోన్: మండలంలోని న్యూవెల్మల్, బొప్పారం గ్రామాల్లోని పంటచేలలో పనిచేస్తున్న రైతులకు సోమవారం చిరుతపులి కనిపించిందని భయాందోళనకు గురయ్యారు. పాద ముద్రలను పరిశీలించిన పొన్కల్ డెప్యూటీ ఎఫ్ఆర్‌వో నజీర్‌ఖాన్ ఇవి నక్కల పాదముద్రలని, ఎవరూ భయాందోళనకు గురికావద్దని సూచించారు. దీంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.

ఎవరెస్ట్ వైపు తొలి అడుగు..

- పర్వతారోహణ శిక్షణకు కార్తీక్
- ఈ నెల 15న సిక్కింకు పయనం..
- ఎవరెస్ట్, కిలిమంజారో పర్వతాలు ఎక్కేందుకు మార్గం సుగమం
- సాహస కృత్యాలతోపాటు కళల్లో రాణిస్తున్న కుమురంభీం జిల్లా యువకుడు



ఇచ్చోడలో నిర్వహించిన పోటీల్లో క్లైంబింగ్ చేస్తున్న కార్తీక్ (ఫైల్)



తల్లిదండ్రులతో కార్తీక్

కెరమెరి(ఆసిఫాబాద్): ఆశయ సాధనకు పేదరికం అడ్డుకాదని నిరుపిస్తున్నాడు.. కుమురంభీం జిల్లా కెరమెరి మండలం కెలి కె గ్రామానికి చెందిన గిత్తే కార్తీక్. సాహస కృత్యాల్లో రాణిస్తూనే, మరోవైపు కళల్లోనూ తన ప్రతిభను చూపుతున్నాడు. తన గమ్యం ఎవరెస్ట్ అధిరోహించడమే అని చెబుతున్న కార్తీక్.. తాజాగా సిక్కిం రాష్ట్రంలో నిర్వహించే పర్వతారోహణ శిక్షణకు ఎంపికయ్యాడు.

తెలంగాణ నుంచి ఐదుగురు..

కెలి కె గ్రామానికి చెందిన గిత్తే రుక్మాజీ, ఇటాబాయిల కుమారుడు కార్తీక్ ప్రస్తుతం మంచిర్యాల జిల్లా చెన్నూర్‌లోని మైనార్టీ గురుకుల కళాశాలలో ఇంటర్ ఫస్టియర్ చదువుతున్నాడు. సిక్కింలోని నామ్‌చా జిల్లాలో ఈనెల 18 నుంచి అక్టోబర్ 16 వరకు విద్యార్థులకు పర్వతారోహణ శిక్షణ అందించనున్నారు. ఈ శిక్షణకు తెలంగాణ నుంచి ఐదుగురు ఎంపిక కాగా.. ఉమ్మడి ఆదిలాబాద్ నుంచి కార్తీక్ ఒక్కరే ఉన్నారు. నెల రోజులపాటు కొనసాగే ఈ కఠినమైన శిక్షణ పూర్తయితే ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన పర్వతం ఎవరెస్ట్‌తోపాటు కిలిమంజారో వంటి శిఖరాలు అధిరోహించేందుకు అనుమతి లభిస్తుంది. ఈ నెల 15న సిక్కింకు బయలుదేరనున్నాడు. కాగా కార్తీక్ ఇప్పటికే బోనగిరిలోని రాక్‌లైన్ స్కూల్ ఆధ్వర్యంలో జూన్ 19న బోనగిరి గుట్టపై 150 ఫీట్ల రాఫెల్లింగ్, 150 ఫీట్ల క్లైంబింగ్‌తోపాటు 650 ఫీట్ల ఎత్తు వరకు ట్రెక్కింగ్ పూర్తి చేశారు. 30 ఫీట్ల బౌల్ట్రింగ్, 10 మీటర్ల జిప్‌లైన్‌లోనూ ప్రతిభ చూపాడు. దీంతో బోనగిరి రాక్‌లైన్ స్కూల్ ఆధ్వర్యంలో సిక్కింలో అందించే శిక్షణకు ఎంపికయ్యాడు. కుటుంబ ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా కలెక్టర్ హేమంత్ బోర్కడే రూ.20 వేల ఆర్థిక సాయం అందించారు.

మాలావత్ పూర్ణ స్ఫూర్తి

"13 ఏటనే ఏడు పర్వతాలు అధిరోహించిన నిజామాబాద్ జిల్లాకు చెందిన మాలావత్ పూర్ణను స్ఫూర్తిగా తీసుకుని సాహస కృత్యాల్లో పాల్గొంటున్నా. ట్రెక్కింగ్, క్లైంబింగ్‌తోపాటు కవితలు రాయడం, చెస్ ఆడటం అంటే ఇష్టం. పేదరికంతో ఆర్థిక కష్టాలు వెంటాడుతున్నాయి. ఆర్థికంగా అండగా ఉంటే రాష్ట్రం పేరు నిలబెడతా.."

– గిత్తే కార్తీక్

ఇతర కళల్లోనూ నేర్పరి



కవిత పోటీల్లో సన్మానం పొందుతున్న కార్తీక్

సాహస కృత్యాలతోపాటు కార్తీక్ ఇతర కళల్లోనూ నేర్పరి. పాఠశాల స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు పలు పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపాడు. వజ్రోత్సవం సందర్భంగా జాగృతి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన కవి సమ్మేళనంలో మొదటిస్థానంలో నిలిచాడు. హైదరాబాద్‌లో నిర్వహించిన ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ పోటీల్లో పతకం సాధించాడు. ఇచ్చోడలో జరిగిన వాటర్‌ఫాల్ పోటీల్లోనూ పాల్గొని సత్తా చాటాడు. గతంలో నేపాల్‌లో జరిగిన చెస్ పోటీల్లో పాల్గొనేందుకు ఆర్థిక ఇబ్బందులు ఎదురుకాగా ప్రజాప్రతినిధులు, అప్పటి కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆర్థికసాయం అందించి ఆదుకున్నారు.

రిమ్స్‌లో రోగి ఆత్మహత్యాయత్నం

- భయంతో పరుగులు తీసిన రోగులు



ఫ్యాన్ ఆపుతున్న షిండే బాలాజీ

ఆదిలాబాద్‌టౌన్: మానసిక స్థితి బాగాలేని ఓ రోగి రిమ్స్‌లో ఆత్మహత్యకు యత్నించడం తీవ్ర కలకలం రేపింది. ఇంద్రవెల్లి మండల కేంద్రానికి చెందిన షిందే బాలాజీకి కడుపు ఉబ్బసం, ఒక కాలు కదలిక లేకపోవడంతో కుటుంబ సభ్యులు నాలుగు రోజుల క్రితం రిమ్స్ ఆస్పత్రిలో చేర్పించగా సీటీటీ మెడిసిన్‌లో చికిత్స పొందుతున్నాడు. సోమవారం మధ్యాహ్నం బెడ్‌పై నుంచి ఒక్కసారిగా లేచి నిలబడి చేతికి ఉన్న సెలైన్ తీసి పారేశాడు. తిరుగుతున్న ఫ్యాన్‌ను చేతితో ఆపి ఫ్యాన్ రెక్కలతో తన మెడను కోసుకున్నాడు. సెలైన్ పెట్టే స్టాండ్లను రెండు చేతులతో పట్టుకుని హంగామా చేశాడు. వార్డులో చికిత్స పొందుతున్న మరో ఐదు గురు రోగులు భయాందోళనకు గురై చేతికున్న సెలైన్లతోనే బయటకు పరుగులు తీశారు. సెక్యూరిటీ గార్డులు పట్టుకుని బెడ్‌కు కట్టేశారు. విషయం తెలుసుకున్న రిమ్స్ డైరెక్టర్ సైక్రియాట్రిస్ట్ ఓం ప్రకాష్‌ను పిలిచి కౌన్సిలింగ్ ఇప్పించారు. అయితే బాలాజీ చికిత్స పొందుతున్న బెడ్ పక్కనున్న మరో రోగికి ఆపరేషన్ చేసి పడుకోబెట్టడంతో తనకెక్కడ ఆపరేషన్ చేస్తారోననే భయంతో ఇలా చేసినట్లుగా అతని భార్య లక్ష్మి తెలిపారు.

పెళ్లి చేసుకుంటానని మోసగించిన వ్యక్తిపై కేసు

ఆదిలాబాద్‌రూరల్: రెండేళ్లుగా ప్రేమించి పెళ్లి చేసుకుంటానని మోసగించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. హైదరాబాద్‌లోని అమీర్‌పేట్‌లో జూనియర్ ఆర్టిస్ట్ ఇన్ ఫిల్మ్ ఇండస్ట్రీస్‌కు చెందిన పాటిదార్ రూపకు ఆదిలాబాద్‌లోని రాంనగర్‌కు చెందిన తాళ్ల ప్రవీణ్‌తో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. పెళ్లి చేసుకుంటానని చెప్పడంతో ఒకే గదిలో కలిసి ఉంటున్నారు. ఇటీవల ప్రవీణ్ నీవు నాకు నచ్చడంలేదని, వేరే వారిని వివాహం చేసుకోవాలని ఫోన్‌లో చెప్పాడు. దీంతో రూప సోమవారం మావల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

దాడి కేసులో ఇద్దరికి రెండేళ్ల జైలు

నిర్మల్‌టౌన్: పోలీస్ అధికారులపై దాడి చేసిన కేసులో నిర్మల్ కోర్టు ఇద్దరికీ రెండేళ్ల జైలుశిక్ష, జరిమానా విధించినట్లు కోర్టు సమన్వయల అధికారి సక్రియ నాయక్ తెలిపారు. లోకేశ్వరం పోలీస్ స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న నరేందర్ ఆగస్టు 30, 2021న కనుకపూర్ గ్రామంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. అనంతరం కుల బహిష్కరణ జరిగిన విషయంపై పోలీసులు గ్రామస్తులతో మాట్లాడుతుండగా దాసరి రవి, నక్కరాజన్న వారిని నెట్టివేసి రాళ్లతో కొట్టేందుకు యత్నించారు. దీనిపై హెడ్‌కానిస్టేబుల్ నరేందర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అప్పటి ఎస్సై బాలకృష్ణ కేసు నమోదు చేసి నిందితులను అరెస్టు చేశారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వై.రమణారావు 12 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా నేరం రుజువుకావడంతో ఇద్దరికి రెండేళ్ల జైలుశిక్షతో పాటు ఒక్కొక్కరికి వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి అజేష్ కుమార్ సోమవారం తీర్పునిచ్చారు.

అతివేగం... ఆపై నిద్రమత్తు

- లారీని ఓవర్‌టేక్ చేయబోయి ప్రైవేటు బస్సు బోల్తా
- ఎనిమిది మందికి గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడు



బోల్తాపడిన ప్రైవేట్ బస్సు

నిర్మల్‌రూరల్: అతివేగం... ఆపై నిద్రమత్తుతో ఓ లారీని ఓవర్ టేక్ చేయబోయి అదుపుతప్పిన ప్రైవేటు బస్సు బోల్తా పడిన ఘటన మండలంలో సోమవారం చోటుచేసుకుంది. రూరల్ ఎస్సై చంద్రమోహన్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.... ఉత్తరప్రదేశ్‌లోని రూపాదియా జిల్లా నుండి 19 మంది నేపాల్ వాసులను తీసుకుని బెంగళూర్‌కు వెళ్తున్న ఓ ప్రైవేటు బస్సు మండలంలోని భాగ్యనగర్ గ్రామ శివారు వద్ద జాతీయ రహదారి ఎన్‌హెచ్ 44 పై లారీని ఓవర్‌టేక్ చేసే క్రమంలో అదుపుతప్పి డివైడర్‌ను ఢీ కొట్టి బోల్తా పడింది. దీంతో బస్సులో ప్రయాణిస్తున్న 8 మంది ప్రయాణికులకు గాయాలయ్యాయి. డ్రైవర్ వెంటనే అక్కడి నుండి పరారయ్యాడు. స్థానికులు గమనించి 108, పోలీసులకు సమాచారం ఇవ్వడంతో గాయపడిన ప్రయాణికులను జిల్లా కేంద్రంలోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. డ్రైవర్ వినోద్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

మహాలక్ష్మి ఆలయంలో చోరీ



తాళం పగులగొట్టిన హుండీ

కుభీర్: మండలంలోని దార్‌కుభీర్ గ్రామంలో ఉన్న మహాలక్ష్మి ఆలయంలో చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తి ఆదివారం రాత్రి ఆలయ హుండీని పగులగొట్టి అందులోని నగదు అపహరించాడున. ఆలయ గర్భ గుడి తాళం పగుల గొట్టి బంగారు, వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లాడు. ఘటనలో సుమారు రూ.2 లక్షల సొత్తు చోరీకి గురైనట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ విషయమై ఏఎస్సై శివయ్యను ప్రశ్నించగా ఇంత వరకు ఫిర్యాదు రాలేదన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను తెరిచిన అధికారులు



భీంపూర్‌లో తాళం తీస్తున్న అధికారులు

తాంసి(బోథ్): నిరవధిక సమ్మెలో భాగంగా అంగన్‌వాడీ టీచర్లు కేంద్రాలను మూసివేసి సోమవారం సమ్మెలో పాల్గొన్నారు. ఐసీడీఎస్ అధికారులు భీంపూర్ మండలంలోని భీంపూర్, పిప్పల్‌కోటి, నిపాని, తాంసి మండలంలోని తాంసి, గిరిగాం, అంబుగాం, పొన్నారి తదితర గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను ఆయా గ్రామాల సర్పంచుల సమక్షంలో తెరిచారు. తాత్కాలిక సిబ్బంది ద్వారా కేంద్రాలను యథావిధిగా నడిపేందుకు చర్యలు చేపట్టనున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో భీంపూర్ సూపర్‌వైజర్ ముంతాజ్, తాంసి సూపర్‌వైజర్ సుజాత, సర్పంచ్‌లు లింబాజీ, గంగయ్య, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మార్కెట్లో 'పొలాల' సందడి









జిల్లాలో పొలాల అమావాస్య వేడుకల నిర్వహణకు అన్నదాతలు సిద్ధమవుతున్నారు. ఈ వేడుకల్లో భాగంగా బసవన్నలను అందంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేయనున్నారు. అలంకరణకు అవసరమైన సామగ్రిని సోమవారం ఇంద్రవెల్లి, బేల మండల కేంద్రంలోని దుకాణాల్లో వ్యాపారులు అందుబాటులో ఉంచారు. వాటిని కొనుగోలు చేస్తున్న రైతులతో మార్కెట్‌లో సందడి వాతావరణం నెలకొంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్, ఇంద్రవెల్లి

సమస్యలు సత్వర పరిష్కారానికి చర్యలు

- ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్



అర్జీలు స్వీకరిస్తున్న చాహత్ బాజ్‌పాయ్

ఉట్నూర్‌రూరల్: ప్రజావాణికి వచ్చే అర్జీలను పూర్తిస్థాయిలో పరిశీలించి సత్వరం పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి చాహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. పింఛన్, రెండు పడక గదుల ఇండ్లు, స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలపై ప్రజలు దరఖాస్తులు సమర్పించారు. కార్యక్రమంలో ఏపీవో కనక భీంరావు, ఏడీఎంఅండ్‌హెచ్‌ఓ కుమ్రబాలు, ఏవో రాంబాబు, ఏపీవో పీవీటీజీ ఆత్రం భాస్కర్, పీహెచ్‌వో సందీప్, ఆర్‌సీవో గంగాధర్, జేడీఎం నాగభూషణం, బీఎడ్ కళాశాల ప్రిన్సిపాల్ మెస్రం మనోహర్, డీపీవో ప్రవీణ్, ఐటీడీఏ మేనేజర్ లింగు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నాగోబా ఆలయంలో ప్రత్యేక పూజలు



శాలువాతో సత్కరిస్తున్న మెస్రం వంశీయులు

ఇంద్రవెల్లి: ఆదివాసీల ఆరాధ్యదైవం కేస్లాపూర్ నాగోబా ఆలయంలో సోమవారం దేవదాయ శాఖ స్థపతి వల్లి నయాగం మెస్రం వంశీయులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్మాణం, అభివృద్ధి, నాగోబా జాతర నిర్వహణ, తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయనను శాలువాతో సత్కరించి నాగోబా ప్రతిమను అందజేశారు. ఈ కార్యక్రమంలో నాగోబా ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్, ఆలయ కమిటీ చైర్మన్ మెస్రం తుకారాం, మెస్రం వంశీయులు మెస్రం చిన్నుపటేల్, మెస్ర బాదిరావ్, తదితరులు పాల్గొన్నారు.

ఐటీడీఏ ఎదుట అంగన్‌వాడీల ఆందోళన



సమ్మెలో కూర్చున్న అంగన్‌వాడీలు

ఉట్నూర్‌రూరల్: తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ అంగన్‌వాడీ ఉద్యోగులు ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయం ఎదుట సోమవారం సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి లంక రాఘవులు మాట్లాడుతూ అంగన్‌వాడీ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, కనీసం వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, పెన్షన్ ఈఎస్ఐ ఉద్యోగ భద్రత కల్పించాలని, గ్రాట్యుటీ, రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లించాలని, ప్రమాద బీమా రూ.5 లక్షలు చెల్లించాలని, ఎస్ఎస్‌సీ అర్హత ఉన్న హెల్పర్లకు ప్రమోషన్ కల్పించాలని, జీపీఎస్ యాప్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కోశాధికారి రత్నమాల, ముక్త, పద్మ, సంగీత, కవిత, లక్ష్మి, స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు. అంగన్‌వాడీలు సమ్మె బాట పట్టడంతో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు తొలగించి ఆయా గ్రామాల సర్పంచ్‌లు, అధికారుల సమక్షంలో కేంద్రాల్లో నిలువ ఉన్న గుడ్లు, పప్పు తదితర సరుకుల వివరాలను నమోదు చేసుకుని వేరే వారికి బాధ్యతలు అప్పగించినట్లు తెలిసింది.

ఇదేమి 'ఉన్నతి'



సరిపడా కుర్చీలు లేక డైట్ ఆవరణలో టీచర్లు

- శిక్షణ కేంద్రంలో సౌకర్యాలు కరువు
- ఇబ్బందులకు గురైన టీచర్లు

ఆదిలాబాద్‌టౌన్: ఉన్నత పాఠశాలల్లో బోధించే ఉపాధ్యాయులకు విద్యాశాఖ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాలలో శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఉపాధ్యాయులు కూర్చునేందుకు కనీసం కుర్చీలు లేకపోవడంతో శిక్షణ కేంద్రంతో పాటు కళాశాల ఆవరణలో కాలయాపన చేశారు. నాలుగు సబ్జెక్టులకు సంబంధించి శిక్షణ ఏర్పాటు చేయగా డైట్‌లో సరిపడా గదులు లేకపోవడంతో ఇబ్బందులు తప్పలేదు. ఇదివరకు జిల్లా కేంద్ర సమీపంలోని విద్యార్థి, వివేకానంద బీఎడ్ కళాశాలల్లో శిక్షణ ఏర్పాటు చేయగా ఉపాధ్యాయులకు కొంత దూరంగా ఉంటుందని డైట్ కళాశాలకు మార్చారు. అయితే ఇందులో ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు శిక్షణ కొనసాగుతోంది. ఈ క్రమంలో శిక్షణ పొందుతున్న ఛాత్రోపాధ్యాయులను తరగతి గదుల నుంచి బయటకు పంపించి టీచర్లకు అక్కడ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించా రు. దీంతో ఛాత్రోపాధ్యాయులు కళాశాల ఆవరణ లో కూర్చోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ విషయ మై శిక్షణ కోఆర్డినేటర్ కంటి నర్సయ్యను వివరణ కోరగా ఇదివరకు నిర్వహించిన శిక్షణ కేంద్రాల్లో విద్యుత్ సమస్య ఉండడంతో ఇక్కడికి మార్చామన్నారు.

విద్యార్థులకు 'శిక్ష'ణ..!

- శిక్షణ కేంద్రానికి కుర్చీలు మోయించిన గురువులు



కుర్చీలు మోస్తున్న విద్యార్థులు

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థులకు మరింత నాణ్యమైన బోధన జరిగేలా ప్రభుత్వం ఉపాధ్యాయులకు 'ఉన్నతి' శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టగా అది కాస్తా విద్యార్థులకు 'శిక్ష'గా మారింది. డైట్ కళాశాలలో నిర్వహించిన ఉన్నతి శిక్షణ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఉపాధ్యాయులకు సరిపడా కుర్చీలు అందుబాటులో లేకపోవడంతో ఎన్జీవో పాఠశాల నుంచి పదిమంది విద్యార్థులను పిలిపించి పక్కనే ఉన్న గదిలో నుంచి కుర్చీలు మోయించారు. అటెండర్లు ఉన్నప్పటికీ విద్యార్థుల చేత కుర్చీలు మోయించడం విమర్శలకు దారి తీసింది.

పాపహరేశ్వరుని చెంత భక్తుల కోలాహలం



ఆలయంలో కిక్కిరిసిన భక్తులు

దిలావర్‌పూర్(నిర్మల్): జిల్లాలోని అత్యంత ప్రాచీన ప్రాశస్త్యం గల కదిలి అటవీ ప్రాంతంలో వెలసిన శ్రీమాతన్నపూర్ణ పాపహరేశ్వరాలయంలో సోమవారం భక్తుల కోలాహలం నెలకొంది. శ్రావణమాసంలో చివరి సోమవారం కావడంతో జిల్లా నలుమూలల నుంచే కాకుండా మహారాష్ట్ర నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అభిషేకం, అన్నపూజ, తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేశామని ఆలయ కమిటీ చైర్మన్ నార్వాడి వెంకట్రావు పాటిల్ తెలిపారు. అంబుగాం గ్రామానికి చెందిన దిగంబర్ పాటిల్ భక్తులకు అన్నదానం చేశారు. భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులు నడిపారు.

కాలినడకన ఆలయానికి..

నిర్మల్ సాయిదీక్షా సేవాసమితి అధ్యక్షుడు లక్కడి జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో 300కు పైగా భక్తులు నిర్మల్ పట్టణంలోని గండిరామన్న దత్తసాయి ఆలయం నుండి 22 కిలోమీటర్ల దూరంలో ఉన్న పాపహరేశ్వరాలయానికి కాలినడకన తరలివచ్చారు.

పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్య

ఆదిలాబాద్‌టౌన్: మద్యం మత్తులో పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. పట్టణంలోని పంజాబ్ చౌక్‌లో బేల మండలంలోని ఏటి గ్రామానికి చెందిన షేక్ సల్మాన్(36) ఈనెల 9న ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పంజాబ్ చౌక్‌లో పురుగుల మందు తాగి పడి ఉన్నాడు. స్థానికులు అంబులెన్స్‌కు సమాచారం అందించడంతో జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ ఎస్సై జీవీ రమణారెడ్డి తెలిపారు.

క్లుప్తంగా

నేడు సమావేశం

కైలాస్‌నగర్: తెలంగాణ ముస్లిం ఆర్గనైజేషన్ జేఏసీ సమావేశాన్ని జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ చౌక్‌లో గల రవితేజ కాన్ఫరెన్స్ హాల్‌లో మంగళవారం నిర్వహించనున్నట్లు జేఏసీ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి ఫిరోజ్ ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ఓయూ రిటైర్డ్ ప్రొఫెసర్ మహమ్మద్ అన్సారీ, ప్రముఖ రచయిత, జర్నలిస్ట్ స్కైబాబా, జేఏసీ రాష్ట్ర కన్వీనర్ సలీం పాషా, ఎగ్జిక్యూటివ్ మెంబర్ సయ్యద్ నవాజ్, సీనియర్ జర్నలిస్ట్ సయ్యద్ కరీంలు హాజరవుతున్నట్లుగా పేర్కొన్నారు. ముస్లిం సంఘాలు, ఎన్జీవో ప్రతినిధులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

కాంగ్రెస్ మండల అధ్యక్షుల నియామకం

ఇచ్చోడ: బోథ్ నియోజకవర్గ వ్యాప్తంగా తొమ్మిది మండలాల్లో కాంగ్రెస్ నూతన మండల అధ్యక్షులను నియమించారు. ఇచ్చోడ మండల అధ్యక్షుడిగా కుంట ప్రవీణ్‌రెడ్డి, బోథ్ అధ్యక్షుడిగా జక్క శ్రీధర్‌రెడ్డి, తాంసి అధ్యక్షుడిగా కొడల నారాయణ, తలమడుగు కళ్లెం రాజేశ్వర్, బజార్‌హత్నూర్ జల్కెపాండురంగ్, నేరడిగొండ ఈరండ్ల చంద్రశేఖర్, గుడిహత్నూర్ అంకిత్ రవీందర్, భీంపూర్ కె. అశోక్, సిరికొండ శేక్ ఇమాంలను నియమిస్తు కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్ గౌడ్ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఇచ్చోడ మండల అధ్యక్షుడు ప్రవీణ్‌రెడ్డి తెలిపారు.

సిరిచెల్మకు పాదయాత్ర

ఇచ్చోడ: శ్రావణ చివరి సోమవారం కావడంతో భక్తులు జామిడి నుంచి సిరిచెల్మ వరకు పాదయాత్రగా వెళ్లి మల్లికార్జున ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ప్రతీ ఏటా నిర్వహిస్తున్న పాదయాత్రలో వందలాది మంది భక్తులు 12కిలో మీటర్లు పొడవున భజన, సంకీర్తనలతో కాలినడకన వెళ్లి పూజలు చేశారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన పాదయాత్ర మధ్యాహ్నం 2 గంటలకు సిరిచెల్మకు చేరుకుంది. నిర్వాహకులు సూర్యకాంత్ గిత్తె, బీజేపీ జిల్లా కార్యదర్శి ఆడేమానాజీ, జెడ్పీటీసీ కథం సుభ్రదబాయి పాల్గొన్నారు.

వారోత్సవాలు విజయవంతం చేయాలి

ఎదులాపురం: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ స్ఫూర్తితో తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి పిలుపు నిచ్చారు. 75వ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను సోమవారం ప్రారంభించారు. జిల్లా కేంద్రంలోని రిమ్స్ వద్ద గల చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారోత్సవాలు 17 వరకు కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో నాయకులు నళినీ రెడ్డి, కుంటాల రాములు, మెస్రం భాస్కర్, చిలుక దేవీదాస్, గేడం కేశవ్, అరుణ్ కుమార్, రమేశ్, గణపతి, అమీనా, సలీం పాల్గొన్నారు.

అణగారిన వర్గాలకు అధికారం అప్పగించాలి

అదిలాబాద్‌రూరల్: అణగారిన వర్గాలకు అధికారం అప్పగించాలని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అగ్గి మల్ల గణేష్ మహారాజ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌక్‌లో తెలంగాణ బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీల దిష్టిబొమ్మలను దహనం చేశారు. బీసీ, ఎస్సీ, ఎస్టీలకు మద్యం, బిర్యానీలు పంచి పెట్టి, బహిరంగ సభలకు తీసుకెళ్తున్నారని ఆరోపించారు. అణగారిన వర్గాలకు సీట్లు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ నాయకులు బరుకుంటి రాజీవ్, బండారి సంతోష్, కరాడి గంగన్న, ఎల్మల మంజుష, ఏనుగు శ్యామల, సుష్మ, శ్రీవాణి, దర్శనాల అశోక్, బడుగు రాజేశ్వర్, అన్నెల లక్ష్మణ్, గణేష్, నరేశ్, సంగర్తి రామచందర్, తదితరులు పాల్గొన్నారు.

రెగ్యులర్ చేయాలి

ఆదిలాబాద్‌టౌన్: రెగ్యులర్ చేయాలని రిమ్స్ జనరల్ హాస్పిటల్ అవుట్‌సోర్సింగ్ సంఘం ఉద్యోగులు డిమాండ్ చేశారు. సోమవారం రిమ్స్ ఆస్పత్రి ఓపీ విభాగం ఎదుట నల్ల బ్యాడ్జిలతో నిరసన చేపట్టారు. బండ శ్రీను, రవి సారయ్య పాల్గొన్నారు.

బదిలీ, పదోన్నతులు చేపట్టాలి

ఆదిలాబాద్‌టౌన్: ఉపాధ్యాయుల బదిలీ, పదోన్నతుల ప్రక్రియను పారదర్శకంగా చేపట్టాలని టీటీఎఫ్ సంఘం నాయకులు కోరారు. సోమవారం జిల్లా విద్య శాఖాధికారి ప్రణీతకు వినతి పత్రాన్ని అందజేశారు. రాథోడ్ గణేష్, రవీందర్, గజేందర్ పాల్గొన్నారు.

తాత్కాల్ ద్వారా పరీక్ష ఫీజు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా పరిధిలో ఓపెన్ స్కూల్ ఇంటర్, పదో తరగతి విద్యార్థులు తాత్కాల్ ద్వారా పరీక్ష ఫీజు చెల్లించవచ్చని జిల్లా విద్య శాఖ అధికారి ప్రణీత, ఓపెన్ స్కూల్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 20 వరకు గడువు ఉందని పేర్కొన్నారు. పదో తరగతి విద్యార్థులు తాత్కాల్ ద్వారా ఫీజు రూ.500, ఇంటర్ విద్యార్థులు రూ.వెయ్యి చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.

పత్తికి తెగుళ్ల బెడద


తాంసిలో సాగు చేసిన పత్తి

- పురుగుమందు పిచికారీ చేసినా.. ఫలితం శూన్యం
- ఆర్థికంగా నష్టపోతున్న రైతులు
- వర్షాల జాప్యంతో ఎదగని పత్తి

తాంసి: ఎదుగుతున్న దశలో పత్తికి తెగుళ్లు వ్యాప్తి చెందడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం పూత, కాత దశలో ఉన్న పత్తికి తెగుళ్లతో పాటు పురుగు ఉధృతి బెడద ఉండడంతో పంట దిగుబడిపై రైతులు ఆందోళన చెందుతున్నారు. పత్తికి తెల్లదోమ, పచ్చదోమ, ఆకు ముడత, పేను బంక, రసం పీల్చే పురుగుల ఉధృతి అధికంగా కనిపిస్తోంది. కొన్ని చోట్ల గులాబీరంగు పురుగు ఉధృతి కూడా ఉంది. తెగుళ్ల బారిన పడుతున్న పత్తిని రక్షించుకునేందుకు రైతులు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికే పంటసాగు కోసం దళారుల వద్ద అప్పు చేసి అధిక పెట్టుబడి పెట్టడం జరిగిందని దిగాలు చెందుతున్నారు. అధిక పెట్టుబడి రావాలనే ఉద్దేశంతో అధిక మోతాదుల్లో రసాయనిక మందులు పిచికారీ చేస్తున్నారు.

ఉమ్మడి మండల వ్యాప్తంగా..

తాంసి, భీంపూర్ మండలాల వ్యాప్తంగా రైతులు 35 వేల ఎకరాల్లో పత్తి సాగు చేస్తున్నారు. అధిక మొత్తంలో రైతులు వర్షాధారంపై ఆధారపడి సాగు చేస్తున్నారు. తెగుళ్ల నుంచి పంటను రక్షించేందుకు పురుగు మందులు సైతం పిచికారీ చేశారు. ప్రస్తుతం కాత దశలో ఉంది. అయితే ఇటీవల అధిక వర్షాలు కురవడంతో ఒక్కసారిగా తెగుళ్లు సోకాయి. తాంసి, పొన్నారి, హస్నాపూర్, బండల్ నాగాపూర్, సావర్గాం, భీంపూర్ మండలంలోని నిపాని, కరంజి(టి), వడూర్, ధనోరా, భీంపూర్, గోన, వడ్గాం గ్రామాల్లో తెగుళ్ల సోకడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

రైతులకు ఆర్థిక భారం..

పత్తి పంటను చీడపీడల నుంచి కాపాడేందుకు అధికంగా పురుగుల మందు పిచికారీ చేసి రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. రసాయన ఎరువులు, కూలీల రేట్లు పెరగడంతో వాటి కోసం ఇప్పటికే రైతులు అధికంగా డబ్బులు వెచ్చిస్తున్నారు. ఇప్పటికే 5 నుంచి 6సార్లు పురుగు, దోమ ఉధృతి నివారించేందుకు మందులు పిచికారీ చేసినట్లు రైతులు చెబుతున్నారు. ఎకరానికి రూ. 4 వేల వరకు ఖర్చు చేస్తున్నారు. దీంతో ఆర్థికంగా నష్టపోతున్నారు.

తెగులు సోకింది



ప్రస్తుతం పత్తికి పచ్చదోమ, ఆకు ముడత తెగులు సోకింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో తెగుళ్లు సోకాయి. పచ్చదోమ ఉధృతి విపరీతంగా పెరిగింది. ఆకుముడత నివారించేందుకు రసాయన మందులను పిచికారీ చేశాను.

– లక్ష్మణ్, రైతు, వడ్డాడి

సూచనలు పాటించాలి

వారం రోజుల క్రితం సరైన వర్షాలు లేక పత్తి పంటలో తెగుళ్లు, చీడపీడల వృద్ధి పెరిగింది. ప్రస్తుతం పంటలు ఆశాజనకంగా ఉన్నాయి. పంటల సాగులో ఏమైనా ఇబ్బందులు ఉంటే రైతులు ఏఈవోలను సంప్రదించాలి. వారి సలహాలు, సూచనలు పాటించాలి.

– రవీందర్, ఏవో, తాంసి

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి


నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

తాంసి: అంగన్‌వాడీ టీచర్ల సమస్యలు పరిష్కరించి, ఉద్యోగ భద్రత కల్పించాలని అంగన్‌వాడీల జిల్లా అధ్యక్షురాలు వెంకటమ్మ డిమాండ్ చేశారు. సోమవారం సమస్యల పరిష్కరం కోసం భీంపూర్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట సమ్మె చేశారు. డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని నినాదాలు చేశారు. వెంకటమ్మ మాట్లాడుతూ.. అంగన్‌వాడీ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలన్నారు. కనీస వేతనం రూ.26 వేలు అందించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మీరాబాయి, సుజాత, గంగుబాయి, సునీత, ప్రియ పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: అంగన్‌వాడీ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని టీఏజీఎస్ జిల్లా అధ్యక్షుడు ఉయిక విష్ణు డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట అంగన్‌వాడీ ఉద్యోగులు చేస్తున్న సమ్మెకు మద్దతు తెలిపారు. బడుగు, బలహీన వర్గాలకు చెందిన అంగన్‌వాడీ ఉద్యోగులు 70 శాతం మంది ఉన్నారని, కనీస వేతనం రూ. 25 వేలు ఇవ్వాలని కోరారు. ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు సుభద్ర, కమల, భగీరథ, నాగుబాయి, కల్యాణి, కుసువర్ధ పాల్గొన్నారు.

ఇచ్చోడ: మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం ఎదుట సోమవారం అంగన్‌వాడీ ఉద్యోగులు నిరవధిక సమ్మె చేపట్టారు. అంగన్‌వాడీ సంఘం నాయకులు మాట్లాడుతూ.. కనీస వేతనం, పెన్షన్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత, చట్టబద్ధ సౌకరాలు ప్రభుత్వం కల్పించలేదన్నారు. అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించేంత వరకు సమ్మె చేస్తామని స్పష్టం చేశారు.

సిరికొండ: వేతనాలు పెంచాలని కోరుతూ.. అంగన్‌వాడీల టీచర్లు సోమవారం నుంచి సమ్మెకు దిగారు. మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. చాలీచాలనీ వేతనాలతో దుర్భరమైన జీవితం వెల్లదీస్తున్నామని వెంటనే సమస్యలు పరిష్కరించాలని కోరారు.

సమ్మె విరమించేది లేదు

తలమడుగు: అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె విరమించేది లేదని అంగన్‌వాడీ కార్యకర్తలు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చిన్నన్న అన్నారు. సోమవారం మండల కేంద్రంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సమ్మె చేపట్టారు. ప్రభుత్వం సమస్యలు పరిష్కరించడంలో విఫలమైందిన మండిపడ్డారు. కార్యక్రమంలో కార్యకర్తలు లలిత, శోభ, మంజుల, మనిత, గంగమ్మ పాల్గొన్నారు.

ఎదులాపురం: అంగన్‌వాడీల డిమాండ్లను నెరవేర్చాలని సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేశ్ ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో సమ్మెకు దిగారన్నారు. అంగన్‌వాడీలతో చర్చించి సమస్యలు పరిష్కరించాలన్నారు.


సమ్మెలో పాల్గొన్న అంగన్‌వాడీ కార్యకర్తలు


సమ్మెకు మద్దతు తెలుపుతున్న నాయకులు

చట్టాలపై అవగాహన అవసరం

నేరడిగొండ: చట్టాలపై ప్రతిఒక్కరికీ అవగాహన ఉండాలని హ్యూమన్‌రైట్స్ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు బొడ్డపాటి దాసు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని మండల సమైఖ్య కార్యాలయంలో ఏపీవో ఉత్తమ్ అధ్యక్షతన డ్వాక్రా సంఘం సభ్యులకు అవగాహన సదస్సు నిర్వహించారు. హక్కులపై అవగాహన లేకపోతే వినియోగదారులు మోసపోయే అవకాశం ఉంటుందన్నారు. మానవ హక్కులు, వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టం, సమాచార హక్కు గురించి వివరించారు. అనంతరం మండల కేంద్రంలోని కేజీబీవీని సందర్శించి విద్యార్థినులకు చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు రమణ, ప్రధాన కార్యదర్శి అమృత్‌కుమార్, గడ్డం మల్లేష్, అధికారులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న బొడ్డపాటి దాసు

పీవోను కలిసి హ్యూమన్‌రైట్స్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జగ్గేరావు,

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి చాహత్ బాజ్‌పాయ్, ఉట్నూర్ సీఐ రామకృష్ణను గ్లోబల్ హ్యూమన్ రైట్స్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జగ్గేరావు, కమిటీ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిశారు. ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై మనోహర్, సభ్యులు సుధాకర్, హన్మంత్‌రావు, పార్వతి పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పాలనలోనే అభివృద్ధి

ఇచ్చోడ: బీఆర్ఎస్ పాలనలో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు, బోథ్ అసెంబ్లీ బీఆర్ఎస్ అభ్యర్థి అనిల్‌జాదవ్‌లు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని నిర్మల్ బైపాస్ వద్ద రూ. 13 కోట్లతో నిర్మించనున్న రోడ్డు పనులను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ.. మండల కేంద్రంలో డివైడర్, సెంట్రల్ లైటింగ్ నిర్మాణంతో డబుల్ రోడ్డు నిర్మాణం కోసం సీఎం కేసీఆర్ రూ 13 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇచ్చోడ ఎంపీపీ నిమ్మల ప్రీతంరెడ్డి, జెడ్పీటీసీ కథం సుభ్రదబాయి, బీఆర్ఎస్ మండల కన్వీనర్ కృష్ణారెడ్డి, ఆర్‌అండ్‌బీ డీఈ సునీల్ పాల్గొన్నారు.


రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

పండుగలు సంప్రదాయాలను గుర్తు చేస్తాయి

నేరడిగొండ: పండుగలు సంప్రదాయాలను గుర్తు చేస్తాయని బోథ్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్ అన్నారు. మండలంలోని లఖంపుర్ బాలికల గిరిజన ఆశ్రమోన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన తీజ్ పండుగ ముగింపు కార్యక్రమానికి హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు బాగా చదివి ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపీపీ రాథోడ్ సజన్, ఉప సర్పంచ్ ఏలేటి దేవేందర్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు గంగాసింగ్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ నానక్ సింగ్, జాదవ్ రమేశ్, గంగాధర్, భీంరావ్, ఇమ్రాన్ ఖాన్, మాధవ్, నిఖిల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రెండు నెలలుగా బడికి తాళం

- పట్టించుకోని ఇన్‌చార్జి ఎంఈవో
- చదువుకు దూరమవుతున్న చిన్నారులు

బేల: మండలంలోని రంఖం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు రెండు నెలల క్రితం జిల్లా విద్యాశాఖ ఆదేశాల మేరకు కర్ణాటక రాష్ట్రానికి శిక్షణకు వెళ్లాడు. దీంతో పాఠశాలకు అప్పటి నుంచి తాళం పడింది. ఇక్కడ చదువుకుంటున్న 18 మంది చిన్నారులు చదువుకు దూరం అవుతున్నారు. ఉపాధ్యాయుడి స్థానంలో మరో ఉపాధ్యాయుడిని సర్దుబాటు చేయాల్సి ఉండగా.. అధికారులు పట్టించుకోవడం లేదు. ఉపాధ్యాయుడిని నియమించాలని గ్రామస్తులు ఇన్‌చార్జి ఎంఈవో శ్రీనివాస్‌కు విన్నవించినా.. ఎలాంటి ఫలితం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఉపాధ్యాయుడిని నియమించాలని ప్రజలు కోరుతున్నారు.


పాఠశాలకు వేసిన తాళం చూపుతున్న గ్రామస్తులు

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

బోథ్: తమకు రావాల్సిన బిల్లులు చెల్లించాలని మధ్యాహ్న భోజన కార్మికులు సోమవారం మండల విద్యాధికారి కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. తొమ్మిది నెలల నుంచి తమకు బిల్లులు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు రూ.3 వేలు గౌరవ వేతనం అందించాలని డిమాండ్ చేశారు. 13 నుంచి సమ్మె చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పత్తి పంట పరిశీలన

ఉట్నూర్‌రూరల్: మండలంలోని చాందూరి గ్రామంలో మండల వ్యవసాయాధికారి రాథోడ్ గణేశ్ పత్తి పంట సోమవారం పరిశీలించారు. నేలలో తేమ ఉన్నప్పుడు 25 కిలోల యూరియా, 10 కిలోల మ్యురేట్ ఆఫ్ పోటాష్‌లను మొక్క మొదళ్లకు 7- 10 సెం.ఈ దూరంలో పడేటట్లుగా వేసుకోవాలన్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా పత్తిలో ఆకుమచ్చ, కాయకుళ్లు తెగుళ్లు ఆశించే అవకాశం ఉందన్నారు. ముందస్తుగా 1గ్రా స్ట్రెప్టో సైక్లిన్, 30 గ్రా కాపర ఆక్సీ క్లోరైడ్‌ను 10 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈవో వినయ్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలి

ఆదిలాబాద్‌టౌన్: సర్కారు కొలువుల సాధన కోసం ప్రభుత్వం కల్పిస్తున్న ఉచిత శిక్షణను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జలగం అనిత అన్నారు. ప్రభుత్వ ఉద్యోగ పోటీ పరీక్షల కోసం కళాశాలలో ఏర్పాటు శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రభాత్ రావు, కెరీర్ గైడెన్స్ సెల్ కోఆర్డినేటర్ కె.చంద్రకాంత్, షేక్ ముజీబ్, నరేష్, లెక్చరర్లు పాల్గొన్నారు.

బోథ్‌ను డివిజన్ చేయాల్సిందే


దీక్షలో కూర్చున్న ఆదివాసీలు

బోథ్: బోథ్‌ను డివిజన్‌గా చేయాలని డిమాండ్ చేస్తూ గత 58 రోజులుగా మండల కేంద్రంలోని బస్టాండ్ ఎదుట చేస్తున్న దీక్షలు కొనసాగుతున్నాయి. సోమవారం దీక్షలో మండల కేంద్రంలోని సాయినగర్ కాలనీకి చెందిన ఆదివాసీ సంఘం నాయకులు కూర్చున్నారు. వీరికి తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు గొడం గణేశ్ మద్దతు తెలిపారు. డివిజన్‌గా చేసేంతవరకు ఉద్యమాన్ని ఆపబోమని బోథ్ డివిజన్ సాధన సమితి సభ్యులు స్పష్టం చేశారు.

అంగన్‌వాడీ కేంద్రాలు వీవోఏలకు అప్పగింత

ఆదిలాబాద్‌రూరల్: అంగన్‌వాడీ కేంద్రాలకు తాళాలు వేసి సోమవారం నుంచి సమ్మెకు వెళ్లడంతో ఐసీడీఎస్ అధికారులు వాటి తాళాలను పగులగొట్టి ఐకేపీ వీవోఏలకు బాధ్యతలు అప్పగించారు. ఐసీడీఎస్ పీడీ మిల్కా ఆదిలాబాద్ రూరల్ మండలంలోని చాందా (టి), పొచ్చర, దిమ్మ, భీంసరి, లాండసాంగ్వి, అర్లి (బి) గ్రామాల్లో పర్యటించారు. దగ్గరుండి పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్, పోలీసుల సమక్షంలో తాళాలు పగులగొట్టించి అప్పగించారు. అంగన్‌వాడీకి వచ్చే పిల్లలకు భోజనం వండి పెట్టాలని సూచించారు. ఎవరైనా ఇబ్బందులకు గురి చేస్తే సమాచారం ఇవ్వాలని సూచించారు. ఎంపీడీవో లక్ష్మీకాంత్‌రావ్, ఐకేపీ ఏపీఎం శుద్ధోదన్, సర్పంచ్‌లు పాల్గొన్నారు.


తాళాలు పగులకొట్టిస్తున్న ఐసీడీఎస్ పీడీ మిల్కా

సమాచారం

అన్నదానం

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయానికి వచ్చే అర్జీదారుల ఆకలిని తీర్చేందుకు వెడ్మ భొజ్జన్న బువ్వ కార్యక్రమంలో భాగంగా సోమవారం అన్నదానం నిర్వహించారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వెడ్మ భొజ్జు, ఖయ్యూం, లాజర్, రాధబాయి, నీలబాయి, అన్నపూర్ణ, దేవానందం పాల్గొన్నారు.

నేడు కార్యాలయం ప్రారంభం

బోథ్: మండల కేంద్రంలో పంచాయతీరాజ్ సబ్ డివిజన్ కార్యాలయాన్ని మంగళవారం ప్రారంభం కానుంది. గతంలో బోథ్‌లో పీఆర్ డివిజన్ కార్యాలయం ఉండగా.. కార్యాలయాన్ని అదిలాబాద్‌కు మార్చారు. అనంతరం ఇక్కడి ప్రజలు ఉద్యమం చేస్తున్న నేపథ్యంలో కార్యాలయాన్ని తిరిగి బోథ్‌లోనే ఏర్పాటు చేస్తున్నారు. దీంతో మండలవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ముగిసిన కృష్ణాష్టమి వేడుకలు

బోథ్: మండలంలోని పొచ్చర గ్రామంలో వారం రోజులుగా కృష్ణాష్టమి వేడుకలను నిర్వహించారు. సోమవారం చిన్నారులు, యువకులు ఉట్టి కొట్టారు. మంగళవారం అన్నదానం నిర్వహించనున్నట్లు తెలిపారు.

వలస కూలీల ఆకలి తీర్చిన మాజీ సర్పంచ్

తాంసి: మండలంలోని పొన్నారి గ్రామ మాజీ సర్పంచ్ భోజన్న యాదవ్ వలస కూలీల ఆకలి తీర్చారు. ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి చెందిన కూలీలు హైదరాబాద్ నుంచి ఛత్తీస్‌ఘడ్‌కు 50 మంది బస్సులో వెళ్తున్నారు. బస్సు పొన్నారి సమీపంలో మొరాయించింది. వలస కూలీలు ఆకలితో ఆలమటించగా.. మాజీ సర్పంచ్ భోజన్న ఆహారం తయారు చేయించి, స్వయంగా వడ్డించారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ

బోథ్: మండల కేంద్రంలోని సాయినగర్ ఎస్సీ కాలనీలో మైసమ్మ ఆలయ నిర్మాణానికి స్థానిక సర్పంచ్ సురేందర్ యాదవ్ సోమవారం భూమిపూజ చేశారు. ఆలయాన్ని సొంత ఖర్చులతో నిర్మిస్తున్నట్లు సర్పంచ్ తెలిపారు.

ఘనంగా కాళోజీ జయంతి

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం కాళోజీ నారాయణరావు జయంతి ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ పావని కుమారి కాళోజీ గొప్పతనం గురించి విద్యార్థులకు వివరించారు. అధ్యాపకులు గణేశ్, దశరథ్, శ్రీలత, తిరుపతి, రూప, వినోద్, కేశవులు, కిషోర్, సువర్ణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సంత్‌సేన్ మహరాజ్ పుణ్యతిథి వేడుకలు

ఇచ్చోడ: మండల కేంద్రంలోని విఠలేశ్వర మందిరంలో సోమవారం సంత్‌సేన్ మహరాజ్ పుణ్యతిథి వేడుకలు నిర్వహించారు. నాయీబ్రహ్మణుల ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు సింగారపు లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షుడు పోతన్న, జనగామ ప్రసాద్, గంగన్న పాల్గొన్నారు.

పేదల పక్షాన కాంగ్రెస్ పోరాటం

ఉట్నూర్‌రూరల్: కాంగెస్ పేదల పక్షాన ఉండి, ప్రజా సమస్యలపై పోరాటం చేస్తుందని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ భొజ్జు పటేల్ అన్నారు. ఆదివారం రాత్రి నర్సాపూర్(బి), గొట్టిపటార్, చాందూరి గ్రామాల్లో పర్యటించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

బరంపూర్‌ను మండలంగా ఏర్పాటు చేయాలి

తలమడుగు: బరంపూర్ మండల ఏర్పాటు కృషి చేయాలని మండల సాధన సమితి నాయకులు కోరారు. సోమవారం ఆదిలాబాద్‌లో డెయిరీ మాజీ చైర్మన్ భూమారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ విషయాన్ని మంత్రులకు, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు. నాయకులు బాబన్న, కేదారేశ్వర్ రెడ్డి, రమేశ్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, లింగారెడ్డి, అశోక్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, వెంకట్ రెడ్డి, సాగర్ గౌడ్, ఆశన్న, రమాకాంత్ పాల్గొన్నారు.

మానవత్వం చాటిన తిరుపతి

ఉట్నూర్‌రూరల్: ఇచ్చోడ మండలంలోని దుబార్‌పేట గ్రామానికి చెందిన పీవీటీజీ తోటి యువతి కాత్లే సౌజన్య కొన్ని నెలలుగా గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతుంది. జిల్లా కేంద్రంలోని పలు ఆసుపత్రుల్లో చికిత్స చేయించిన మెరుగవకపోవడంతో సోమవారం సమస్యను తోటి సంఘం రాష్ట్ర నాయకులు మర్సుకోల తిరుపతి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్ వివరించగా.. స్పందించిన పీవో మెరుగైన వైద్యం కోసం రూ. 10 వేలు అందించి, ఐటీడీఏ ద్వారా అంబులెన్స్ ఏర్పాటు చేసి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలించారు.

నేడు జాబ్ మేళా

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలోని నిరుద్యోగ యువతకు ప్రైవేట్‌లో ఉద్యోగాల కోసం మంగళవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఉపాధికల్పన అధికారి మిల్కా ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు సాత్నాల క్వార్టర్స్ వద్ద గల జిల్లా ఉపాధికల్పన కార్యాలయంలో నిర్వహించే ఈ మేళాకు ఎంఎస్ఎన్ ల్యాబరేటరీ సంస్థ ప్రతినిధులు హాజరవుతారని పేర్కొన్నారు. టెక్నికల్ ట్రెయినీ పోస్టులు 50 ఉన్నాయని, ఇంటర్మీడియెట్ ఆపై చదివిన 17 నుంచి 20 ఏళ్లలోపు వారు అర్హులని తెలిపారు. ఎంపికైన వారికి రూ.11వేల జీతంతో పాటు ఇతర అలవెన్సులు ఉంటాయని పేర్కొన్నారు. బయోడెటా, విద్యార్హత పత్రాల జిరాక్స్ కాపీలతో హాజరు కావాలని సూచించారు. వివరాలకు 7075986130, 9490923080 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

'ప్రజాసేవ చేసేందుకే అమెరికా నుంచి వచ్చా'

కైలాస్‌నగర్: ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతోనే అమెరికా నుంచి ఆదిలాబాద్‌కు వచ్చానని కాంగ్రెస్ నాయకుడు కంది శ్రీనివాసరెడ్డి అన్నారు. తన కేఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని ఖానాపూర్, రణదీవెనగర్‌లో మహిళలకు ప్రెషర్ కుక్కర్లు పంపిణీ చేశారు. మహిళలు మంగళ హారతులతోబొట్టుపెట్టి, టపాసులు కాల్చుతూ స్వాగతం పలికారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో చాలామంది పౌష్టికాహార లోపంతో బాధపడుతున్నట్లు గుర్తించామన్నారు. కార్యక్రమంలో నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.


కుక్కర్ అందజేస్తున్న శ్రీనివాసరెడ్డి